క్లుప్తంగా

మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యం
సబ్ కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ



గన్నవరం: మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా వ్యవస్థలు పోరాడటంతో పాటు ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సబ్ కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ అన్నారు. మండలంలోని దావాజీగూడెం బీసీ బాలికల వసతి గృహంలో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా వ్యవస్థ పెను సవాల్‌గా మారిందన్నారు. బాలికలు పరిచయం లేని వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి సమస్య ఎదురైన వెంటనే పాఠశాల, హాస్టల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. అనంతరం ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జడ్జి సందర్శించారు. హాస్టల్ వార్డెన్లు, పలువురు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వడ్లమూడి సేవలు చిరస్మరణీయం



పెనమలూరు: రచయితగా, రైతు నాయకుడిగా వడ్లమూడి నాగేశ్వరరావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ డ్యాన్స్ అకాడమీ టీచర్ వి.పద్మ అన్నారు. యనమలకుదురులోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం ప్రముఖ రచయిత, కవి, రైతు నాయకుడు వడ్లమూడి నాగేశ్వరరావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మ మాట్లాడుతూ వడ్లమూడి కవితలు, రచనలు సమాజ చైతన్యానికి దోహదపడ్డాయని చెప్పారు. రైతులను చైతన్య పరిచి వారి హక్కులు కాపాడారని వివరించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ కాశిం, మహిళా సంఘం కార్యదర్శి షేక్ వలీబి, నాగూర్‌బి, షేక్ మస్తాన్‌వలి, అభ్యుదయ కార్యకర్తలు, బాలబాలికలు పాల్గొన్నారు.

212 మంది విద్యార్థులకు వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లెలోని విజ్ఞాన్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్, మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులు చాక్లెట్లు, బిస్కెట్లు వంటి జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ పవన్ సీతారామ్ చెప్పారు. శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే చదువులో రాణించగలమన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు దరిచేరకుండా ఉంటామని తెలిపారు. మొత్తం 212 మంది విద్యార్థులకు డాక్టర్ పవన్ సీతారామ్‌తో పాటు డాక్టర్ వినీలా, డాక్టర్ స్పందనలు వైద్య పరీక్షలు నిర్వహించారు. విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ పూర్ణచంద్రాచార్యులు, లయన్స్ క్లబ్ కార్యదర్శి మాకినేని శ్రీనివాసరావు, కోశాధికారి అక్కినేని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం కూల్చివేత



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరులో అనధికార నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. మున్సిపల్ పరిధిలోని కానూరులో అనుమతులు లేకుండా అదనపు అంతస్తులను బిల్డర్లు నిర్మిస్తుండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించి చర్యలు తీసుకున్నారు. కమిషనర్ షేక్ నజీర్ మాట్లాడుతూ తాడిగడప మున్సిపల్ పరిధిలో అనుమతులు లేని కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్డర్లు నిబంధనలు పాటించాలని సూచించారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. ప్రధాన గ్రామంలో పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో అందిన ఫిర్యాదు మేరకు మరమ్మతు పనులు పూర్తి చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

నిర్లక్ష్యంతో నిరుపయోగం!

లక్షలు వెచ్చించి నిర్మించిన చేతి పంపులు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. మురుగులో కొన్ని, డ్రైయిన్లలో కొన్ని, వ్యర్థాల పక్కన కొన్ని పంపులు మగ్గిపోతూ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చలేకపోతున్నాయి. స్థానిక సంస్థలు, మండల పరిషత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కంకిపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఇవి నిరుపయోగంగా మారాయి. స్వల్ప మరమ్మతులతో వీటిని వినియోగంలోకి తీసుకురావచ్చు. తాగునీటికి కాకపోయినా ఇంటి అవసరాలకు అయినా నీరు సమకూరుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. - కంకిపాడు



కంకిపాడు మండల పరిషత్ కార్యాలయం రోడ్డులో..



కంకిపాడు చెరువు కట్ట వద్ద వ్యర్థాల నడుమ ఇలా..



కంకిపాడు కరెంట్ ఆఫీసు ఎదురుగా పిచ్చి కంప అల్లుకుని..



కంకిపాడు డ్యూటీపాక సెంటరులోని పంపు



పునాదిపాడులో నిరుపయోగంగా..



ఈడుపుగల్లు హాస్టల్ ప్రహరీ వెంబడి ఇలా..

ఏటిపాయకు పోటెత్తిన వరద

ఏటిపాయ అంచులు తాకుతూ వరదనీటి ప్రవాహం



పడవలను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

కంకిపాడు: ఏటిపాయకు వరదనీరు మళ్లీ పోటెత్తింది. ఎగువ నుంచి వరదనీరు విడుదల కావటంతో పాయ అంచులు తాకుతూ నీరు సముద్రం వైపు పరుగులు తీస్తోంది. మత్స్యకారులు ముందస్తు చర్యల్లో భాగంగా పడవలను ఒడ్డుకు చేర్చి భద్రపర్చుకున్నారు. మరో మారు వచ్చిన వరదతో ఏటిపాయలోని లంక భూములకు రాకపోకలు నిలిచినట్లయ్యింది.

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 3 లక్షలు క్యూసెక్కుల వరదనీటిని అధికారులు ఏటిపాయ, ప్రధాన కాలువలకు విడుదల చేశారు. ఇటీవల విడుదల చేసిన వరదనీటితో ఏటిపాయ నిండుగా ప్రవహిస్తోంది. ఏటిపాయ రోడ్డు పూర్తిగా నీట మునిగింది. పుష్కర ఘాట్ పరిసరాల్లో భారీగా వరద నీరు చేరింది. కాసరనేనివారిపాలెం శివాలయం అంచులకు వరదనీరు వచ్చింది.

అప్రమత్తమైన యంత్రాంగం

భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏటిపాయను తహసీల్దార్ వి.భావనారాయణ సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా టాంటాం ద్వారా ఏటిపాయలోకి పశువులు, గొర్రెల కాపరులు మేతకు వెళ్లరాదని ఆదేశించారు. లంక పొలాల్లో పనులకు కూలీలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వరదనీరు ఉధృతి తగ్గేవరకూ ఏటిపాయలోకి వెళ్లవద్దని సూచించారు.

వార్షిక సంబరాలకు తిరుపతమ్మ ఆలయం ముస్తాబు



గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం ఆగస్టు 1వ తేదీ శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా జరిగే వార్షిక సంబరాలకు ముస్తాబైంది. అమ్మవారి ఆలయంతో పాటు నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. శుక్రవారం ఉదయం అఖండ దీపారాధనతో సంబరాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు. అనంతరం మాను(మహాలక్ష్మీ) పూజ, అమ్మవారికి గ్రామ పొంగళ్ల సమర్పణ జరుగుతుందన్నారు. సాయంత్రం గ్రామంలోని పలు ప్రాంతాల నుంచి ప్రభ బండ్లు ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరుతాయని చెప్పారు. రాత్రికి శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపమ్మ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు అమ్మవారు గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ఊరేగింపు అనంతరం తిరిగి ఆలయ ప్రవేశం చేస్తారని వివరించారు.

విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందాలి



కానూరులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షెరీన్‌బేగం

పెనమలూరు: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుని లక్ష్యాల వైపు సాగాలని వక్ఫ్ ఆస్తుల సర్వే కమిషనర్ షేక్ సెరీన్‌బేగం అన్నారు. సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల్లో భాగంగా వెంచుర-2025 సాహిత్య, సాంస్కృతిక పోటీలు కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఆధునిక సాంకేతికతను విద్యార్థులు చెడుగా ఉపయోగించకుండా వారి అభివృద్ధికి దోహదపడే విధంగా చూసుకోవాలన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ 16 విభిన్న అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, గురువారం కూడా పోటీలు జరుగుతాయని వివరించారు. అకాడమీ సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలిత్‌ప్రసాద్, అకాడమీ పరిపాలన అధికారి మోహన్‌రావు, ప్రిన్సిపాల్ వి.సాయికృష్ణ, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని కొత్తపల్లి, మడిచర్ల ఎంపీపీ స్కూళ్లను అంగలూరు డైట్ అధ్యాపకులు, మండల అబ్జర్వర్ ఎస్. జోజిబాబు బుధవారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో అమలవుతున్న సంసిద్ధత కార్యక్రమం, మధ్యాహ్న భోజనం పనితీరు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, నోట్స్‌లను తనిఖీ చేశారు. పాఠ్యాంశాల బోధన విద్యార్థులను ఆకట్టుకునే విధంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. మడిచర్ల ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో వినూత్నంగా పాఠ్యాంశాల బోధన చేయటాన్ని జోజిబాబు అభినందించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మైత్రేయి, వీరుళ్లు, కృప పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడరోడ్డులోని స్టేట్ బ్యాంకు వీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న మహిళ ఒంటరిగా స్టేట్ బ్యాంకు వీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఆ మహిళ ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లగా దొంగతనం జరిగింది. ఇంటి తాళాలను పగలు కొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు ఇంట్లోని రూ. 2 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును అపహరించుకుని పోయారు. దుండగులు తీసుకువచ్చిన కత్తిని అక్కడే వదిలిపెట్టి పరారయ్యారు. బుధవారం ఉదయం డ్యూటీ నుంచి వచ్చిన నర్సు ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితురాలు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న నాయకులు

గన్నవరం రూరల్: ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రజా వేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపల్లి గ్రామంలో బుధవారం ప్రజావేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అదానికి లాభం చేకూర్చేందుకు ఈ మీటర్లు పెడుతున్నారని ఆరోపించారు. ఏపీలో మాత్రం ఈ మీటర్లు ముందుగా పెడుతున్నారని, మిగతా రాష్ట్రాల్లో వ్యతిరేకించారని చెప్పారు. గ్రామాల్లోని ప్రజలు స్మార్ట్ మీటర్లు పెట్టే వారిని తిప్పి కొట్టాలని, ఇప్పటికే కరెంట్ బిల్లులు అధికంగా వచ్చి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మీటర్లు పెడితే మూడు రెట్లు బిల్లులు పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చోట మూడు రెట్లు బిల్లులు అధికంగా వచ్చాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలంతా ఐకమత్యంతో వ్యతిరేకించాలని చెప్పారు. నాయకులు చాగంటిపాటి వెంకటేశ్వరరావు, రమేష్, సోమిశెట్టి శ్రీనివాసరావు, బెజవాడ తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్ విధానాలపై అవగాహన

లబ్బీపేట(విజయవాడతూర్పు): సెల్ఫ్ డిఫెన్స్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు మహిళా పోలీస్‌స్టేషన్ అధికారులు, శక్తి బృందాలు అవగాహన కలిగిస్తున్నాయి. అందులో భాగంగా బుధవారం నగరంలోని పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపద సమయంలో చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్లను విద్యార్థులకు తెలియజేశారు. పటమట స్టేషన్ పరిధిలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్ చేయడం వలన నష్టాలు, సీసీ కెమెరాల వలన ఉపయోగాలు, నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. శక్తి యాప్ వలన ఉపయోగాలను తెలియజేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ టి.దైవప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

విజయవాడరూరల్: ఇళ్లస్థలాలు లేని పేదవారు ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల స్థలాల కోసం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి.సుగుణ పేర్కొన్నారు. ఆన్‌లైన్లో కాకపోయినా ఆఫ్‌లైన్లో దరఖాస్తులను సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లకు అందచేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లస్థలాలు మంజూరై ఇళ్లు నిర్మించుకోకుండా ఉన్న వారు ఆ స్థలాన్ని వద్దనుకొని కొత్తగా ఇళ్ల స్థలం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలను మంజూరు చేసేందుకు స్థలసేకరణ చేస్తోందన్నారు.

టీబీ నియంత్రణకు కృషి చేయాలి

గన్నవరం రూరల్: ఆత్కూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వీరపనేనిగూడెం, తెంపల్లి గ్రామాల్లో బుధవారం జ్వరాలపై సర్వే జరిగింది. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీజనల్‌గా వచ్చే వ్యాధులపై హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. తెమడతో కూడిన దగ్గు, రక్తం పడటం, జ్వరం, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, రాత్రి పూట చెమట టీబీ లక్షణాలుగా చెప్పారు. టీబీ చికిత్స ద్వారానే ఓడించాలని సూచించారు. ఏఎన్ఎంలు సునీత, రాజకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుణదల ఈఈ పి. హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక చింతలపేట, రామ్‌నగర్, సొసైటీపేట, పాత గన్నవరం, కొత్తపేట, ఇస్లాంపేట, శేషసాయి గార్డెన్, బీబీ గూడెం, స్లేట్ స్కూల్ ఏరియా, గొల్లనపల్లి ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

మహిళలు స్వశక్తితో ఆర్థిక వృద్ధి సాధించాలి



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న యూకో బ్యాంక్ డీజీఎం రియాజ్

గన్నవరం రూరల్: మహిళలు స్వశక్తితో ఎదిగి ఆర్థిక వృద్ధి సాధించాలని యూకో బ్యాంక్ డీజీఎం రియాజ్ పేర్కొన్నారు. మండలంలోని సూరంపల్లి యూకో బ్యాంక్‌లో 18 డ్వాక్రా సంఘాలకు మంజూరైన రూ.3.27 కోట్ల చెక్కును బుధవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు రుణాలు అందజేయడంలో యూకో బ్యాంక్ ముందుంటోందని చెప్పారు. బ్యాంక్ సేవలు వినియోగించుకుని ఆర్థిక వృద్ధి సాధించాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్, యూకో బ్యాంక్ చీఫ్ మేనేజర్ జగదీష్, జోనల్ మేనేజర్ శరవణన్, ఏజీఎం ప్రశాంత్, సీనియర్ మేనేజర్ జ్యోతి, మేనేజర్ ఖాదర్‌బాబా, ఫీల్డ్ ఆఫీసర్ తేజశ్విని, ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.

మండలంలో 6,562 పేద కుటుంబాలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో దారిద్ర్య రేఖకు దిగువన 6,562 కుటుంబాలు ఉన్నాయని పి4 సర్వేలో వెల్లడైందని ఎంపీడీఓ బి.వి గ్రీస్ తెలిపారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి జాబితాలను ఖరారు చేశామన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా ఆయా కుటుంబాల వారికి వ్యాపారాలు చేసుకునేందుకు రుణ సదుపాయం, ఉపాధి అవకాశాలు కల్పించడం, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి బుధవారం ఆర్థిక సాయం అందించారు. యనమలకుదురులో మాజీ వార్డు సభ్యురాలు బడుగు శకుంతల భర్త వైఎస్సార్ సీపీ వీరాభిమాని బడుగు మధుసూదన్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం పార్టీ నాయకులు అందించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, పార్టీ వివిధ విభాగాల నేతలు గుమ్మడి విజయ్‌కుమార్, షేక్.అష్రఫ్, మరీదు శ్రీనివాసరావు, గుమ్మడి అన్వేష్, మరీదు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడిగడపలో..

తాడిగడపలో పార్టీ అభిమాని షేక్ ఆరీఫ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన కుటుంబానికి చక్రవర్తి ఇచ్చిన రూ. 10 వేలు సాయం పార్టీ నేతలు అందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వేమూరి బాలకృష్ణ, షేక్ ఖాదర్‌బాషా, ఎండీ ఆలీజిన్నా, షేక్ ముజీబ్, ఎండీ అర్షద్, ఎండీ ఇంతియాజ్, కత్తెరబాషా, ఎన్.కిషోర్, బడుగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి



అంబాపురం(విజయవాడరూరల్): ఇళ్లస్థలాలను మంజూరు చేయాలని కోరుతూ అంబాపురం గ్రామానికి చెందిన పలువురు మహిళలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు వినతిపత్రం అందచేశారు. బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే విచ్చేశారు. కొత్త ఫించన్ల కోసం దరఖాస్తులు పెట్టుకున్నామని, ఇంకా మంజూరు కాలేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక కారణాల వలన కొంతమందికి రాకపోవడం వాస్తమేనని, ప్రభుత్వం నుంచి మంజూరుకు మార్గదర్శకాల వస్తాయన్నారు. డ్రెయిన్లు, రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. సర్పంచి గండికోట సీతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.